
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

గురువారం 11 జూలై 2024

రైతు బజార్లలో తక్కువ ధరకు బియ్యం

కడప(కలెక్టరేట్), జూలై 10: పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల దృష్ట్యా తక్కువ ధరలకు రైతు బజార్లలో గురువారం నుంచి నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ తెలిపారు. కడప, ప్రొద్దుటూరు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో బీపీటీ సోనా మసూరి స్టీమ్ బియ్యం ఒక కిలో రూ.49, బీపీటీ సోనా మసూరి బియ్యం(రా) ఒక కిలో రూ.48, కందిపప్పు కిలో రూ.160కి ఇస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జేసీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాకా పడుతున్నారు



- వైసీపీ హయాంలో చక్రం తిప్పిన పోలీస్ అధికారులు
- మళ్లీ వచ్చేందుకు ప్రయత్నం
- నాడు వైసీపీ చెప్పినట్టు చేయని వారు లూప్‌లైన్‌లో
- వీరికి ఇప్పుడైనా న్యాయం జరిగేనా ?

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పోలీసు వ్యవస్థే కీలకం. శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి, బెట్టింగ్‌లను అరికట్టడంలో పోలీసులదే కీలకపాత్ర. అలాంటి ఖాకీ వ్యవస్థ వైసీపీ హయాంలో గాడి తప్పిందని తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఐపీసీ యాక్టు బదులు వైసీపీ యాక్టు అమలు చేశారని చెడ్డపేరు మూటగట్టుకుంది. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా.. కీలక స్థాయి పోలీసు బాస్‌లే వైసీపీ నేతలకు జీ హుజూర్ అనడంతో ఇక జిల్లాలో పనిచేసే సిబ్బంది వన్‌సైడ్ అయిపోయారు. వైసీపీ పాలనలో కొందరు ఖాకీలకు టీడీపీ ముద్రవేసి ఇబ్బంది పెట్టారు. వైసీపీ నేతలు చెప్పిన అడ్డమైన పనులు చేయనందుకు కొందరిని బదిలీచేశారు. మరికొందరు నిబంధనలు అతిక్రమించలేక లూప్‌లైన్‌కు వెళ్లిపోయారు. జిల్లాలో కొందరు పోలీసులే చక్రం తిప్పారు. అంతా తామై వ్యవహరించారు. మళ్లీ అదే బ్యాచ్ ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వంలో కూడా కీలక పోస్టింగుల కోసం కాకా పడుతుండడంపై చర్చ నడుస్తోంది. మరి వైసీపీ హయాంలో లూప్‌లైన్, టీడీపీ ముద్ర పడ్డ ఖాకీల పరిస్థితి ఏమిటి అని పలువురు చర్చించుకుంటున్నారు.



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్పీగా ఎక్కువ కాలం కేకేఎన్ అన్బురాజన్ పనిచేశారు. ఆయన హయాంలో కడపలో డీఎస్పీగా పనిచేసిన సూర్యనారాయణ, సీఐలు అశోక్‌రెడ్డి, రాజరాజేశ్వర్‌రెడ్డి, రాజు, సంజీవరెడ్డి చక్రం తిప్పారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వీరంతా వైసీపీ నేతలకు జీ హుజూర్ అంటూ వారు చెప్పిన పనులు చేశారనే విమర్శ ఉంది. టీడీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేశారనే ఆరోపణలున్నాయి. స్థానిక సంస్థలైన కార్పొరేషన్, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఎన్నికలు జరిగాయి. టీడీపీ, ఇతరులు నామినేషన్లు వేయకుండా వైసీపీ విధేయ పోలీసులు అడ్డుకున్నారు. ఒకవేళ నామినేషన్ వేసినా పోలీసులు బెదిరించి విత్‌డ్రా చేయించారని చెబుతారు. కడప కార్పొరేషన్‌లో పలువురు నామినేషన్లు వేశారు. అప్పటి అధికారి సూచనల మేరకు వైసీపీకి అనుకూలురుగా చెలామణి అయిన సీఐలు, ఎస్ఐలు పలువురిని బెదిరించి విత్‌డ్రా చేయించారనే విమర్శలున్నాయి. ఖాకీ డ్రెస్ వేసుకుని ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్నామన్న విషయం మరిచిపోయి వైసీపీకి వన్‌సైడ్‌గా చేయడం అప్పట్లో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ప్రొద్దుటూరులో ఇబ్రహీందే వేదం

ప్రస్తుతం కడప టూటౌన్‌లో పనిచేస్తున్న సీఐ ఇబ్రహీం వైసీపీ హయాంలో ప్రొద్దుటూరులో చక్రం తిప్పారంటారు. ప్రొద్దుటూరు పోలీసు వ్యవస్థను శాసించారనే ఆరోపణలున్నాయి. లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రొద్దుటూరులో వైసీపీ నేతలు ఎక్కడాలేని అడ్డంకులు సృష్టించారు. దీనికి సంబంధించి అప్పట్లో సీఐగా పనిచేసిన రాజారెడ్డి, ఇబ్రహీంలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. లోకేశ్ కూడా ఫైర్ అయ్యారు. అయితే ఎన్నికలకు ముందు ఇబ్రహీంను కడప టూటౌన్‌కు బదిలీ చేశారు. ఇబ్రహీం రాక ముందు కడప టూటౌన్ సీఐగా తబరేజ్ పనిచేసేవారు. ఆ సమయంలో వైసీపీ నేతలపై టీడీపీ నేతలు దాడి చేశారంటూ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. అప్పటికే స్టేషన్‌లో ఉన్న టీడీపీ వారిపై దురుసుగా వ్యవహరించడంతో పాటు కార్యకర్తలపై దాడిచేశారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అక్కడికి వెళ్లగా వీరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 14 మంది టీడీపీ నేతలపై కేసు నమోదు చేయాల్సిందిగా అప్పటి సీఐ తబరేజ్‌పై వైసీపీ నేతలు వత్తిడి తెచ్చారు. వైసీపీ నేతలే స్టేషన్‌పై దాడిచేసే ప్రయత్నం చేసి టీడీపీ నేతలపై కేసు నమోదు చేయాలని వత్తిడి చేశారంటూ తబరేజ్ డీఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెబుతారు. డీఎస్పీ మాత్రం సీఐ తబరేజ్ ఫిర్యాదును పట్టించుకోకుండా ఆయనను బదిలీ చేసి ప్రొద్దుటూరులో ఉన్న ఇబ్రహీంను కడపకు తీసుకున్నారు.

ఇక కడప తాలుకాలో సీఐగా పనిచేస్తున్న రాజా వైసీపీ నేతల మాటలు వినడం లేదని చెప్పి ఎన్నికల కోడ్ రోజునే ఆయనను బదిలీ చేశారు.

లూప్‌లైన్‌లోకి

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తమకు నచ్చని ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలను లూప్‌లైను పోస్టులకు పంపించేశారంటారు. సీఐ హేమసుందర్రావు తిరుపతి ఏసీబీకి వెళ్లారు. అక్కడ కూడా ఇబ్బందులు రావడంతో రైల్వేకు వెళ్లినట్లు చెబుతారు. ఇక మరో సీఐ రామక్రిష్ణ చిన్నచౌకులో పనిచేశారు. అప్పటి డిప్యూటీ సీఎం, జిల్లా అధ్యక్షుడు కలిసి ఈయనను జిల్లా నుంచే ట్రాన్స్‌ఫర్ చేయించారంటారు. వైసీపీ నేతలు చెప్పిన అడ్డగోలు పనిచేయలేక శ్రీనివాసరెడ్డి ఏసీబీకి వెళ్లిపోయారంటారు. యుగంధర్ మరికొందరు పోలీసులు లూప్‌లైన్‌లో ఉన్నారంటారు.

ఇక కడప ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేసిన బాలస్వామిరెడ్డి వైసీపీ నేతల వేధింపులకు గురయ్యారు. సెబ్‌లో సీఐగా పనిచేసిన బాలస్వామిరెడ్డి ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టు రట్టు చేశారు. అయితే.. ఈ బెట్టింగ్‌లో జిల్లాలోని అప్పటి కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధులతో పాటు తాడేపల్లిలో ఉంటున్న కొందరికి సంబంధం ఉన్నట్లు బయటపడిందని చెబుతారు. విచారణలో కళ్లు బయర్లు కమ్మే వాస్తవాలు వెలుగు చూశాయంటారు. బెట్టింగ్ ముఠా ఎవరెవరికి ఎంత మామూళ్లు ఇచ్చేది, ఏ సీజన్‌కు ఎంత బిజినెస్ జరిగేది ఇవన్నీ ఆధారాలతో సహా బాలస్వామిరెడ్డి సేకరించారు. బెంగళూరుకు వెళ్లి బెట్టింగ్ ముఠాను పట్టుకొచ్చారు. దీంతో అప్పటి ప్రజాప్రతినిధులు శరణు శరణు అంటూ తాడేపల్లిని ఆశ్రయించినట్లు చెబుతారు. అప్పటికే బాలస్వామిరెడ్డి డీఎస్పీగా ప్రమోషన్ వచ్చి 8 నెలలైంది. బెట్టింగ్ వ్యవహారంలో జిల్లాలోని బడా వైసీపీ నేతల పేర్లతో పాటు ఎవరికెంత వాటా, పోలీసుల భాగస్వామ్యంపై ఆయన కూపీ లాగడంతో.. వెంటనే ఆయనను తిరుమలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక తిరుపతి ఉప ఎన్నికల సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్నప్పుడు వాహనాలు తనిఖీ చేస్తుండగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడుగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి కారులో ఓటర్లకు పంచేందుకు చీరలు, ముక్కుపుడకలు, కమ్మలు తీసుకెళుతుంగా పట్టుకున్నారు. పై నుంచి తీవ్ర స్థాయిలో వత్తిడి వచ్చినప్పటికీ వదలలేదు. దీంతో ఆయనను వెంటనే వీఆర్‌కు పంపించారు. తరువాత కడప ట్రాఫిక్ డీఎస్పీగా వచ్చారు. కడపలో అప్పటి కొందరు వైసీపీ నేతలు ప్రధాన రోడ్లు, కాల్వలు ఆక్రమించేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది సృష్టించారు. అయితే ట్రాఫిక్‌లో భాగంగా ప్రభుత్వ స్థలాలు గుర్తించి వాటిని ఖాళీ చేయించి పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేశారు. రోడ్డు ఆక్రమణలు తొలగించారు. ఇది అప్పటి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అండ్ కోకు నచ్చలేదంటారు. డిప్యూటీ సీఎం తన ఇంటికి రావలసిందిగా కబురు పంపగా, నేను ప్రభుత్వ కార్యాలయానికి అయితే వస్తా, ఇళ్లకు రాను అన్నారని చెబుతారు. దీంతో తన మాట వినలేదని డిప్యూటీ సీఎం, తనకు సహకరించలేదని అప్పటి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఇతర వైసీపీ నేతలు ఈయనను టీడీపీ కోవర్టుగా ముద్ర వేసి ఎస్‌బీకి బదిలీ చేశారు. ఎస్‌బీలో కూడా ఈయన డీఎస్పీ. అయితే అక్కడ పనిచేసేదేమీ ఉండదు. కేవలం జీతం మాత్రం తీసుకోవాలి. పని లేకపోవడంతో కొన్ని నెలల పాటు అక్కడే ఖాళీగా ఉన్నారు. ఎన్నికల ముందు హ్యూమన్‌రైట్స్‌కు బదిలీ చేశారు. తన భార్య అనారోగ్యంగా ఉందని విజ్ఞప్తి చేసినా సరే.. మా గవర్నమెంటులో మా మాట వినకుండా రూల్స్ పాటిస్తావా అని బదిలీ చేసినట్లు చెబుతారు. ఇలాంటి వారు చాలా మంది వైసీపీ పాలనలో లూప్‌లైన్‌లోకి వెళ్లారు. కూటమి ప్రభుత్వం రావడంతో వీరికి న్యాయం జరుగుతుందని భావించారు. అయితే వైసీపీ హయాంలో చక్రం తిప్పిన పలువురు మళ్లీ ఇప్పుడు కీలకస్థానాల్లోకి రానున్నారనే ప్రచారం సాగుతోంది. కడపకు మళ్లీ మేమే వస్తామంటూ వైసీపీతో అంటకాగిన రాజరాజేశ్వరరెడ్డితో పాటు మరికొంత మంది పాతటీం పేర్లు చక్కర్లు కొడుతుండడం చూసి టీడీపీ నేతలే ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలా అయితే తాము నష్టపోతామని వైసీపీ హయాంలో ఇబ్బంది పడ్డ పోలీసు అధికారులు వాపోతున్నారు.



క్రమశిక్షణ అవసరం

- కలెక్టర్ లోతేటి శివశంకర్
- నర్సాపురం జడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ
- క్రమశిక్షణ, విద్యాసామర్థ్యాలపై తీవ్ర అసంతృప్తి

కాశినాయన, జూలై 10: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమని లేదంటే వారు విద్యలో రాణించలేరని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారితో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఎంఈవో నిర్మల, ప్రధానోపాధ్యాయుడు కొండిశెట్టిని మండలానికి, పాఠశాలకు సంబంధించిన పలువిషయాలను అడిగి తెలుసుకున్నారు. మెనూను పరిశీలించి మధ్యాహ్నభోజనంలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలని వంట ఏజెన్సీ వారికి చూచించారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని ప్రభుత్వం ఇచ్చేదానికంటే పెట్టే ఖర్చు ఎక్కువ అవుతుందని వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

విద్యాసామర్థ్యాలపై తీవ్ర అసంతృప్తి

నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ లోతేటి శివశంకర్ 10వ తరగతి విద్యార్థులతో కలిసి కూర్చొని ఉపాధ్యాయుడు చెబుతున్న సైన్సు పాఠాలు విన్నారు. అనంతరం స్టేజిపైకి వచ్చి ఓ విద్యార్థిని పిలిచి తెలుగులో సైన్సు పాఠం చదవమనగా చదవలేకపోయాడు. దీంతో విస్తుబోయిన కలెక్టర్ 10వ తరగతి విద్యార్థికి తెలుగు చదవను రాకపోతే ఇక్కడ ఉపాధ్యాయులు ఏమి చదువు చెపుతున్నారని ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించారు. అనంతరం చిన్న చిన్న విషయాలపై కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నించగా ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. బోధించే ఉపాధ్యాయుడిని తన తరగతి గదిలో కనీసం 10 మంది విద్యార్థుల పేర్లు చెప్పమన్నారు. ఆ ఉపాధ్యాయుడు చెప్పలేకపోయారు. తరగతి గదిలో సగం మంది విద్యార్థులు జుట్లు పెంచుకొని రకరకాలుగా ఉండటంతో.. వీరిని చూస్తే చదువుకునే విద్యార్థులని ఎవరైనా గుర్తుపట్టగలరా అని ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించారు. వెంటనే ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ప్రధానోపాధ్యాయుడు క్రమశిక్షణతో పనిచేయాలని అప్పుడే ఇతర ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా ఉంటారని లేదంటే ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుందన్నారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులను పరిశీలిస్తే పాఠశాల విద్యాప్రమాణాలు చాలా బలహీనంగా ఉన్నాయన్నారు. ప్రతివారం క్విజ్‌పోటీలు పెట్టాలని, వ్యాయామం చేయించాలన్నారు. 3నెలల తర్వాత తిరిగి పాఠశాలకు వస్తానని పిల్లల్లో విద్యాసామర్థ్యాలు, ప్రమాణాలు, క్రమశిక్షణ మెరుగుపడకపోతే చర్యలు తప్పవన్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ షరీఫ్ కలెక్టర్‌ను కలిసి గ్రామంలో 100 సంవత్సరాల ఉర్దూపాఠశాల ఉందని అక్కడ ప్రస్తుతం ఉర్దూ టీచర్ లేక ఇబ్బందిగా ఉందని తెలిపారు. కలెక్టర్ వెంట తహశీల్దారు కృష్ణ, ఎంఈవో నిర్మల, స్థానిక సర్పంచ్ ఖాజావలి, డీటీ సత్య, ఆర్ఐ దక్షణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ఫీజు కావాలి.. పనులు చేపట్టరా?

- సీహెచ్‌సీ, హౌసింగ్, రోడ్లపై విచారణ చేయిస్తా
- పాత టోల్‌గేటు వద్ద వరుస ప్రమాదాలపై..
- ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఆగ్రహం

చెన్నూరు, జూలై 10: "ఏళ్ల కొద్దీ టోల్‌ఫీజు వసూలు చేసుకున్నారు. అందుకు తగ్గట్లు ప్రజలకు మాత్రం పనులు చేయలేదు. మీ నిర్వాకంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. అసలు కాసింతైనా మీకు కామన్‌సెన్స్ ఉందా, ఇలాగైతే ఎలా? ఎవరినీ ఉపేక్షించేది లేదు" అంటూ కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి టోల్‌ప్లాజా కన్‌స్ట్రక్షన్ అధికారి బాషా, సైట్ ఇంజనీరు గోపాలరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ సభాభవనంలో బుధవారం ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన చెన్నూరు మండల సమావేశంలో పలు సమస్యలపై ఎమ్మెల్యే అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాత టోల్‌గేటు వద్ద ఇటీవల వరుస ప్రమాదాలు జరుగుతుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైవే పరంగా ఎలాంటి సమస్యలు ఉండకూడదని, తక్షణం హైవే అధికారులతో మాట్లాడించాలన్నారు. టోల్‌ప్లాజా పని, రోడ్ల పని చేసిన పీడీని తనతో మాట్లాడించాలని ఆదేశించారు. ఇష్టానుసారంగా మీరు టోల్‌ఫీజు వసూలు చేసుకుపోతారు, ఆ తరువాత కష్టాలు మాత్రం ప్రజలపై పడుతున్నాయని ఇలాగైతే సహించేది లేదన్నారు. తక్షణం టోల్‌ప్లాజా పరంగా హైవేలో ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ఎలాంటి పనులు చేపట్టాలో అవన్నీ ఏ టైంకు పూర్తి చేస్తారో తనకు చెప్పాలని గట్టిగా అడిగారు. కనుపర్తి వద్ద నిర్మాణంలో ఉన్న ఇళ్ల నాణ్యతపై పదే పదే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై కూడా విచారణ తప్పదన్నారు. ఇక కట్టబోయే పక్కా ఇళ్లు అయినా బాగుండేలా చూసుకోవాలని హౌసింగ్ ఏఈని హెచ్చరించారు. ఇప్పటి దాకా గ్రామ పంచాయతీ సర్పంచులకు నిధులు లేక అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. కేంద్రంతో మాట్లాడించి అవసరమైన నిధులను నేరుగా సర్పంచులకు అందేలా చూస్తామని తెలిపారు. తన హయాంలో ప్రధానంగా తాగునీరు, మురుగునీటికాల్వల నిర్మాణం, రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.



హైవే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- హాకీకి జిల్లాలో ప్రత్యేక స్థానం
- రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- హాకీ సౌత్‌జోన్ చాంపియన్ పోటీలు ప్రారంభం



హాకీ పోటీలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పులివెందుల/పులివెందుల టౌన్, జూలై 10: క్రీడా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 2వ హాకీ ఇండియా జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్‌జోన్ చాంపియన్ షిప్-2024 క్రీడాపోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం క్రీడాకారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మన రాష్ట్రం నుంచి ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు పొందారన్నారు. ఈ క్రీడా పోటీలు జిల్లాలోని క్రీడాభిమానులకు, స్థానికులకు వారం రోజుల పాటు కనువిందు చేయనున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో మున్ముందు ఇదే క్రీడా మైదానంలో మరిన్ని జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయన్నారు. జాతీయ క్రీడ హాకీకి కడప జిల్లాలో ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ నేపథ్యంలో హాకీకి అత్యంత ప్రాచుర్యం కల్పిస్తూ మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రావీణ్య కోచ్‌లను ఏర్పాటుచేసి అకాడమీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తూ అన్ని ప్రవేశాలు, ఉద్యోగాల కల్పనలో అవకాశాన్ని అందిస్తోందన్నారు. ఈ క్రీడాపోటీలు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కాకుండా హాకీ అసోషియేషన్ తరపున నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.

ఆడుదాం ఆంధ్రతో రూ.130కోట్లు నీళ్లపాలు

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన ముగుస్తున్న సమయంలో కేవలం 44 రోజుల్లో ఆడుదాం ఆంధ్ర అనేపేరుతో రూ.130కోట్ల నిధులను నీళ్లపాలు చేసిందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. క్రీడా కిట్లను కొనడానికి రూ.44కోట్లు, టీషర్టులు, టోపీలను కొనేందుకు రూ.30వేలు, భోజనాలకు రూ.4కోట్లు.. ఇలా రూ.130కోట్లు 44రోజుల్లోనే ఖర్చుచేశారంటే ఏ మేరకు క్రీడలపై అభిమానం ఉందో అర్థం అవుతుందన్నారు. ఆ రూ.130కోట్లను క్రీడాకారులపై ఖర్చుపెట్టి ఉంటే బాగుండేదన్నారు. వైసీపీ హయాంలో కోచ్‌లకు 7నెలల బకాయిలు పెండింగ్ పెట్టిందని, టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డ 35 రోజుల్లోనే ముఖ్యమంత్రి చొరవతో జిల్లాలోని కోచ్‌లకు పెండింగ్ జీతాలు చెల్లించామన్నారు. క్రీడారంగంలో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసేవ్యవస్థను కూడా అరికడతామన్నారు. త్వరలో కమిటీ వేసి నకిలీ విధానాన్ని రూపుమాపుతామన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను తయారుచేయడమే తమ ప్రాధాన్యత అన్నారు.

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి జిల్లాలో గ్రామీణ స్థాయి నుంచి క్రీడా ఆణిముత్యాలను దేశ, ప్రపంచసాయిలో మెరిసేలా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి క్రీడా రంగంపై అత్యంత శ్రద్ధ వహిస్తుండడం మన అదృష్టమన్నారు. భవిష్యత్తులో శాప్ సంస్థ మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అనంతరం మంత్రి క్రీడాజ్యోతి వెలిగించి హాకీ పోటీలను ప్రారంభించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఆంధ్ర హాకీ అసోసియేషన్ నిరంజన్‌రెడ్డి, ప్రెసిడెంట్ చాణిక్య రాజు, డీఎస్డీఓ జగన్నాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి జట్లు తలపడనున్నాయి.

విద్యుత్ చార్జీలపై స్పష్టత ఇవ్వండి : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 10: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్‌రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారని.. అయితే ఇందులో విద్యుత్ చార్జీలు పెంచుతారా లేక తగ్గిస్తారా అనే విషయంలో స్పష్టత లేదని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చెప్పారే తప్ప భవిష్యత్తులో చేయబోయే వాటిపై స్పష్టత లేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనే పెంచం, ఇంకా తగ్గిస్తామని జగన్‌రెడ్డి అన్నారన్నారు. ప్రజలు నమ్మి ఓటేశారని అయితే ఆయన అధికారంలోకి వచ్చాక ప్లేట్ ఫిరాయించారన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఎనిమిదిసార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32,166కోట్ల అదనపు భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందన్నారు. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడిపోవడానికి విద్యుత్ చార్జీల పెంపు ప్రధాన కారణమన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కరెంటు చార్జీలు పెంచం, వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడాన్ని ఉపసంహరంచుకుంటామని టీడీపీ కూటమి నాయకులు చెప్పారన్నారు.

కానీ శ్వేతపత్రంలో ఈ విషయంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచుతారా లేక తగ్గిస్తారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.



ఆంధ్రప్రదేశ్ హాకీ క్రీడాకారుల పరేడ్



హాకీ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న మంత్రి

పేదల ఇళ్లకు గ్రహణం

- ఇళ్ల నిర్మాణంలో చేతులెత్తేసిన జగన్ సంస్థలు
- 212585 ఇళ్లకు 600 మాత్రమే పూర్తి
- పేదల ఆశలు.. అడియాశలేనా

కడప(కలెక్టరేట్), జూలై 10: గత జగన్ సర్కారులో పేదలకు ఇళ్లు కట్టించి, తాళం చేతికిస్తామని ఆశలు రేపారు. ఏకంగా ఇళ్లు కాదు.. ఊళ్లకు ఊళ్లు కట్టిస్తామని ఆర్భాట ప్రచారంతో ఊదర గొట్టారు. దాదాపు మూడున్నరేళ్ల పాటు ఇళ్ల నిర్మాణాలను సాగదీసి.. చివరకు ఎన్నికల సమయానికి 212585 ఇళ్లకు కేవలం 600 ఇళ్లు పూర్తి చేసి తమ వల్ల కాందంటూ చేతులెత్తేశారు.

జిల్లాలో నాలుగేళ్ల కిందట పేదల ఇళ్ల నిర్మాణాలకు సెంటు స్థలం చొప్పున లక్షమందికి పైగా పంపిణీ చేశారు. 434 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. లే అవుట్లలో మౌలిక సదుపాయాలు, వాటర్ సప్లయ్, పబ్లిక్ హెల్త్ కింద ఆఘ మేఘాలతో పనులు చేపట్టారు. అయితే బిల్లులు చెల్లించడంలో మాత్రం చతికిల పడ్డారు. కేంద్రం ప్రతి లబ్ధిదారునికి ఇచ్చే నిధులు తప్ప, రాష్ట్రం నుంచి నయ్యాపైసా ఇవ్వకుండా ఇళ్లు నిర్మించుకోవాలంటూ హుకుం జారీ చేశారు. దీంతో సెంటు స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి కావాలంటే రూ.5 నుంచి 6 లక్షలు వ్యయం కావడంతో పేదలకు తలకు మించిన భారమైంది. ఫలితంగా ఇళ్ల నిర్మాణాలు ఆపేశారు. ఇలాంటి సమయంలో జగన్ సర్కారు ఎత్తుగడ వేసి తన అనుకూలురైన పెద్ద పెద్ద కాంట్రాక్ట్ సంస్థలను రంగంలోకి దింపింది. ఆ సంస్థలు కూడా పేదలపై ఎనలేని మమకారం, దయా కరుణతో ముందుకొచ్చారు. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు ఎస్‌జీహెచ్‌ఎస్ నిధులు కలుపుకొని రూ2.10 లక్షలతో ఇల్లు కట్టేందుకు సిద్ధమంటూ కాలనీలలో ఆప్షన్-3 కింద 212585 ఇళ్లు పూర్తి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.


జగనన్న కాలనీలో పూర్తికాని ఇళ్లు

జగన్ సర్కార్ ఎన్ని ఎత్తులు వేసినా...

జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలు ఆది నుంచి విమర్శల మధ్య సాగుతున్నాయి. 434 లే అవుట్లలో 67522 ఇళ్లు లబ్ధిదారులకు మంజూరు చేశారు. ఎన్నికల నాటికి కింద మీద పడి పేదలపై ఒత్తిళ్లు పెంచి ఇళ్లు కట్టిస్తే ఓట్లు గంపగుత్తగా పడతాయని భావించారు. అప్పటి జగన్ సర్కారు ఎన్ని ఎత్తులు వేసినా కేవలం 11500 ఇళ్లు పూర్తి చేయగలిగింది. లబ్ధిదారులు సొంత సలాల్లో దాదాపు 28989 మందికి ఇళ్లు మంజూరు కాగా... అందులో 20959 ఇళ్లు పూర్తి చేయడం గమనార్హం.

పెండింగ్ బిల్లులతో ఆగిన పేదల ఇళ్లు

జగన్ సర్కారు నవరత్నాలంటూ అట్టహాసంగా పేదలకు ఇళ్లు అనే పథకం తెచ్చింది. కానీ జిల్లాలో గుర్తించిన 434 లే అవుట్ల పరిధిలో వాటర్ సప్లయ్ పైపులను, రోడ్లు, మౌలిక సదుపాయాలకు సంబంధించి బిల్లులు చెల్లించని కారణంగా ఇళ్ల నిర్మాణాలు ప్రశ్నార్థకంగా మారాయి. ముఖ్యంగా కాలనీలు కట్టించేందుకు ముందుకు వచ్చిన సంస్థలు కూడా తూతూ మంత్రంగా ఇళ్ల నిర్మాణాలు చేయడమే కాకుండా ఆప్షన్-3 కింద లబ్ధిదారులకు వచ్చిన బిల్లులను ఇప్పటికే సొమ్ము చేసుకున్నాయి. బేస్ మట్టం స్థాయిలో కొన్ని, రూఫ్ లెవల్, స్లాబ్ లెవల్లో గృహాలను పూర్తి చేయకపోవడం వల్ల పెద్ద ఎత్తున సిమెంట్, ఐరన్ లాంటివి కూడా తమ సొంత ఆస్తుల్లాగా అమ్ముకున్నారనే విమర్శలన్నాయి ఇటీవల పులివెందుల గృహ నిర్మాణాల్లో అక్రమాలు వెలుగు చూడడంతో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణయ్య శనివారం తనిఖీలు చేసి కలెక్టర్‌కు నివేదికలు అందజేశారు. ఇక పోతే పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చిన సంస్థల్లో పులివెందులలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశరెడ్డికి చెంది న రాక్రేట్ సంస్థ, కడపలో నెల్లూరుకు చెందిన జేఎన్ ఆర్ కన్‌స్ట్రక్షన్, ప్రొద్దుటూరులో వినాయక సంస్థ, మైదుకూరు, బద్వేల్‌లలో మదన్ మోహన్ సంస్థలు పేదలకు ఇళ్లు కట్టిస్తామని నమ్మించి ఇపుడు చేతులెత్తడంతో లబ్ధిదారులు ఇంటి కల కలగానే మిగలనుంది.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తాం



జిల్లాలో లే అవుట్లలో వాటర్ సప్లై పైపులైను, రోడ్డు పనులకు సం బంధించి కొన్ని బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు త్వరలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళిక ప్రకారం పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తాం.

- కృష్ణయ్య, జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్

విద్యుత్ సమస్యలను వాట్సప్ ద్వారా తెలపండి : ఎస్‌ఈ


మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి రమణ

కడప (నాగరాజుపేట), జూలై 10: ప్రజలు వ్యయ ప్రయాసాలకు గురి కాకుండా వాలిపోయిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు వంటి విద్యుత్ సమస్యలను వాట్సప్‌ద్వారా తెలపాలని విద్యుత్‌శాఖ అధికారి రమణ అన్నారు. బుధవారం కడప విద్యుత్ వినియోగదారుల సేవా కేం ద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం వాట్సాప్ ద్వారా తమ సమస్యలు పరిష్క రించుకోవడానికి వీలుగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారుని పేరు, గ్రామం, మండలం, వారి మొబై ల్ నెంబరుతో వాట్సప్ నెం:9440814264కు పంపితే హెల్ప్ డెస్క్ సిబ్బంది సంబంధిత అధికారులకు తెలిపి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అనుసరిస్తారన్నారు. సమస్య తీవ్రత బట్టి విద్యుత్ సమస్యలను సకా లంలో పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారుడికి సకాలంలో సేవలు అందించ డమే సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న డాక్టర్ వీరయ్య

సికెదిన్నె, జూలై 10: పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రెండు రోజుల పుట్టగొడుగుల పెంపకం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం ద్వారా యువత ఉపాధి అవకాశాలు పెంచుకోవడంతోపాటు మంచి పౌష్టికాహారాన్ని సమాజానికి అందించవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని, అందుకు యువత ఉపాధి రంగాల్లో ముందుండాలన్నారు. శాస్త్రవేత్త శిల్పకళ మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో ఉండే వివిధ రకాలను వివరించి.. వాతావరణానికి అనుకూలమైన వాటిని పెంచుకోవాలన్నారు. పుట్టగొడుగుల్లో మంచి పోషకాహారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, మానస, రైతులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా పాఠశాల తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో

సిద్దవటం, జూలై 10: మండలంలోని బాకరాపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం డీఈవో అనురాధ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు చదువులో కొందరు వెనుకబడి ఉన్నారని, వారికి కూడా నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 అరుణ, హెచ్‌ఎం లక్ష్మీకేశమ్మ, సీఆర్‌పీ హైమావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సొంత బావే హతమార్చాడు...

- స్నేహితుడుతో కలిసి బావమరిదిని హత్య చేసిన వైనం
- పోలీసుల విచారణలో వెల్లడి


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, జూలై 10: స్థానిక రెడ్డీస్‌కాలనీలోని సిద్ధిక్ మసీద్ డౌన్ వీధిలో షేక్.రెడ్డిబాష కుమారుడు అబ్దుల్‌రహీంను సొంత బావ హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య కేసులను నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ ఇన్‌చార్జి సీఐ చంద్రశేఖర్ బుధవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. అబ్దుల్‌రహీం గత కొంత కాలంగా రాయచోటి పట్టణంలోని ఠాణా సమీపంలోని మదరసా ఎదురుగా గల సందులో ఉన్న కేజియన్ చికెన్ సెంటర్‌లో కూలి పనిచేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో సొల్యూషన్ పీల్చడం, మద్యం తాగడం వంటి చెడు అలవాట్లకు బానిసై.. గత కొంత కాలంగా తన తల్లిని, సొంత అక్కను వేధిస్తూ డబ్బులు ఇవ్వమని నానా రకాలుగా ఇబ్బంది పెట్టేవాడు. దీంతో అతని వేధింపులు తట్టుకోలేక అబ్దుల్‌రహీం సొంత పెద్ద అక్క భర్త అయిన షేక్. ఇర్షాద్‌అలీ అలియాస్ సూరా దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అతను చాలా సార్లు అబ్దుల్‌రహీంను మందలించాడు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో ఇర్షాద్‌అలీ చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 6వ తేదీ రాత్రి సుమారు 9.30 గంటల ప్రాంతంలో ఇర్షాద్‌అలీ తన చిన్ననాటి స్నేహితుడైన చెన్నముక్కపల్లె గ్రామం రాజులకాలనీ శ్యామలవారిపల్లెకు చెందిన సాయికుమార్‌కు విషయం చెప్పాడు. అతనితో కలిసి అబ్దుల్‌రహీం ఇంటికెళ్లి తమ వెంట తీసుకువచ్చి గున్నికుంట్ల రోడ్డులోని సమాధుల వద్ద చాకుతో గొంతుకోసి హత్య చేశారు. శవాన్ని అక్కడే కంపచెట్లలో పడేసి నిందితులు పరారయ్యారు. అబ్దుల్ రహీం తండ్రి రెడ్డిబాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయచోటి అర్బన్ పోలీసులు సీఐ చంద్రశేఖర్,ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో బుధవారం నిందితులను రాయచోటి పట్టణ పరిధిలోని వీరబల్లి రింగు రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి హత్య చేసేందుకు ఉపయోగించిన చాకుతో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రాయచోటి కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ తెలియజేశారు.

ట్రావెల్ ఏజన్సీలో చోరీ.. రూ.లక్ష అపహరణ


దొంగలు పగలగొట్టిన ట్రావెల్ ఏజన్సీ పైకప్పు, క్యాష్ టేబుల్

కడప (క్రైం), జూలై 10: కడప నగరం కృష్ణసర్కిల్ సమీపంలోని మౌలానా ట్రావెల్స్ ఏజన్సీలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు రూము పైకప్పు పగలగొట్టి లోపలికి ప్రవేశించి నగదు అపహరించారు. ట్రావెల్ నిర్వాహకుడు మౌలానా బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. మంగళవారం రాత్రి 9.30 గంటలకు ట్రావెల్ ఏజన్సీ మూసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ఆ రూము పైన ఉన్న రేకులను పగలగొట్టి రూములోకి వెళ్లి.. క్యాష్ టేబుల్ పగల గొట్టి అందులో ఉన్న లక్ష నగదును అపహరించారు. కొంత మంది గల్ఫ్ వెళ్లేందుకు టికెట్ కోసమని నగదును మంగళవారం ఇచ్చారని.. ఆ నగదును టేబుల్ లాకర్‌లో పెట్టి తాళం వేసుకుని వెళ్లామని.. దొంగలు టేబుల్‌లో ఉన్న లక్ష రూపాయల అపహరించినట్లు బాధితులు పేర్కొన్నారు. పక్కనే ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర ప్లేవుడ్ షాపులో చోరీకి యత్నించారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ ఘటన పరిశీలించి కేసు నమోదు చేశారు.

పోలీసు స్టేషన్‌లో మాజీ కౌన్సిలర్ హల్‌చల్

- మీసాలు దువ్వి.. తొడలు కొట్టి.. నేనెవరో తెలియదా..
- మిమ్మల్ని బదిలీ చేయకుంటే నాపేరు మార్చుకుంటా..

ప్రొద్దుటూరు, జూలై 10: అధికార పార్టీలో వార్డు స్థాయి నాయకుడినైన నన్ను పోలీసులు గుర్తించరా... పోలీసు స్టేషనుకు వస్తే గౌరవ మర్యాదలు పాటించరా.. అందరితో పాటు మమ్మలను చూస్తారా.. అంటూ మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకుడు చింతకుంట జయలింగారెడ్డి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో హల్‌చల్ చేశాడు. మాజీ కౌన్సిలర్ జయ లింగారెడ్డి ఇటీవలే ఎన్నికలకు కొద్దిరోజుల ముందు వైసీపీ నుంచి తన భార్య 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితతో పాటు వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాడు. ఆయన బుధవారం మధ్యాహ్నం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఓ పంచాయితీ విషయమై పెద్దమనిషిగా స్టేషనుకు వెళ్లాడు. స్టేషన్‌లో వుండే హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ తనను అధికారపార్టీ వార్డు స్థాయి నాయకుడిగా కూడా గుర్తించకుండా.. మర్యాద పాటించలేదని.. అందరితో సమానంగా ట్రీట్ చేశారని.. తనకు ఇది అవమానమని ఆవేశంతో ఊగిపోయారు. మీకు నేనెవరో తెలిసేలా చేస్తా.. మిమ్మల్ని స్టేషన్ నుంచి బదిలీ చేయించకుంటే.. నాపేరు మార్చుకుంటా.. అంటూ మీసాలు దువ్వి తొడలు కొట్టి సవాల్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మీపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్స్‌ను బెదిరించినట్లు వారు ఆరోపించారు.

ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. మధ్యాహ్నం ఒక పంచాయితీ విషయమై పెద్దమనిషిగా చింతకుంట జయలింగారెడ్డి వచ్చాడని.. అతన్ని పోలీసులు అధికార పార్టీ నాయకుడుగా గుర్తించి గౌరవించలేదని పోలీసులపై దుబారాగా మాట్లాడినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎస్ఐ గానీ, నేను గానీ లేనని.. కానీ జరిగిన విషయంపై విచారించానని... ఆయన మద్యం సేవించి వున్నాడని.. నిజంగానే కానిస్టేబుల్స్‌కు అతను ఎవరో తెలియదన్నారు. కానీ పోలీసులను దుబారాగా మాట్లాడటం సరికాదని అధికారపార్టీ అయిన సామాన్యులైన అందరితో ఒకేలా నడుచుకుంటామని తెలిపారు.

చెత్త సేకరణ కేంద్రాల్లోనే డంపింగ్ చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి


చెత్త సేకరణ కేంద్రంలో గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు ఇస్తున్న డీపీవో

పెనగలూరు, జూలై 10: గ్రీన్ అంబాసిడర్‌లు గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రభుత్వం నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాల్లోనే వేయాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి సూచించారు. బుధవారం కంబాలకుంట సమీపంలో నిర్మించిన పెనగలూరు చెత్త సేకరణ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం చెత్త సేకరించాలని, తడిచెత్త, పొడి చెత్తలను వేర్వేరు చేసి డంపింగ్‌యార్డుల్లో సూచించిన తొట్లల్లో డంపింగ్ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె డంపింగ్‌యార్డుల్లో నిర్మించిన వివిధ రకాల తొట్లను పరిశీలించారు. అలాగే ఏ తొట్టిలో తడిచెత్త వేయాలి, పొడి చెత్త వేయాలి, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏ తొట్టిలో వేయాలనే విషయాలపై క్షుణ్ణంగా వివరించి.. ఆవిధంగా గ్రీన్ అంబాసిడర్లను అనుసరించాలని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్లను ఈ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసేందుకు గ్రామ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామ కార్యదర్శుల సమావేశం నిర్వహించి నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో పార్వతి పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే నాబార్డు లక్ష్యం : డీడీఎం



మామిడి చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

సుండుపల్లె, జూలై 10: గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి నాబార్డు సేవలు ఎంతో దోహదపడుతున్నాయని నాబార్డు డీడీయం విజయవిహారి తెలిపారు. నాబార్డు ఆర్థిక సహాయంతో గిరిజన రైతులు సాగు చేసిన మామిడి తోటలను ఆయన బుధవారం తనిఖీ చేసి.. తోటల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మండలంలోని మడితాడు, సుండుపల్లె గ్రామ పంచాయతీల్లో 500 మంది రైతులకు ఒక్కొక్కరికి ఒక ఎకరా చొప్పున 500 ఎకరాలు మా తోట కార్యక్రమంలో భాగంగా సాగు చేయడం జరుగుతుందన్నారు. గుంతలు తీసేటప్పటి నుంచి చెట్లు నాటే వరకు వాటి సంరక్షణ రైతులు చూసుకునే విధంగా నాబార్డు సేవలు రైతులు పొందుతున్నారన్నారు. అలాగే రైతులకు ఎరువులు, పైపులు, నీటి వసతి లేని రైతులకు బోర్లు వేయిస్తున్నామని తెలిపారు. అలాగే రైతుల నాటిన జామ ఇతర పండ్ల తోటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీబీయంఎస్ ప్రధాన కార్యదర్శి రత్నం, ఎండీ జావీద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువపై ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

- సర్వేచేసిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
- రేపో మాపో చర్యలు చేపట్టనున్న అధికారులు



ఆక్రమణకు గురైన కాలువ మ్యాప్

ప్రొద్దుటూరు, జూలై 10: ప్రొద్దుటూరు మునిసిపాలిటీలోని కాలువపై అక్రమంగా నిర్మించిన కట్టడాలపై ఆంధ్రజ్యోతిలో జూన్ 30న 'ఆక్రమించి అడ్డగోలు నిర్మాణాలు' కథనం వచ్చింది. ఈకథనంపై మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి స్పందించారు. టౌన్ ప్లానింగ్ అధికారులను, మున్సిపల్ సర్వేయర్‌ను కాలువ ఆక్రమణలపై సర్వే చేయాలని ఆదేశించారు. ఆమేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ టౌన్ సర్వేయర్ కాలువ ఆక్రమణలపై సర్వే చేశారు. ఎక్కెడెక్కడ ఎంత మేరకు అక్రమ కట్టడాలు నిర్మాంచారో మ్యాప్ తయారీ చేశారు. లీగల్‌గా ఎలాంటి సమస్యలు రాకుండా కాలువపై ఆక్రమణలను, మున్సిపల్ స్థలంలోని కట్టడాన్ని తొలగించేందుకు రంగం సిద్ధమైంది. రేపో మాపో కాలువపై ఆక్రమ నిర్మాణాలను తొలగించే చర్యలు తీసుకోనున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెబ్‌ల్యాండ్‌లో భూమి తారుమారు

డిప్యూటీ తహసీల్దార్, రిటైర్డ్ తహసీల్దార్‌లపై కేసు

కొండాపురం, జూలై 10: ఒక వ్యక్తికి చెందిన భూమిని తన ప్రమేయం లేకుండా రికార్డులు తారుమారు చేసి మరొకరికి మార్చినందుకు డిప్యూటీ తహసీల్దార్, రిటైర్డ్ తహసీల్దార్‌లపై తాళ్లప్రొద్దుటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కెసుగుమంచి పల్లెలో పెద్దరంగారెడ్డి గారి చిన్నారెడ్డి అనే వ్యక్తికి సంబంధించి ప్రధాన రహదారికి ఆనుకొని 133/4 సర్వే నెంబ రులో ఉన్న 33 సెంట్ల భూమిని మరొకరి పేరు మీదకు వెబ్ ల్యాండ్ ద్వారా తారుమారు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు ఏడేళ్ల కిందట కొండాపురం తహసీల్దార్‌గా పనిచేసి.. రిటైర్డ్ అయిన ప్రభాక రెడ్డి, ప్రస్తుత కొండాపురం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజేశ్వ రమ్మతో పాటు మరో ఆరుగురి ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వీరందరిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు. ఈ భూమి పుల్లయ్య అనే వ్యక్తితో తమ బంధువులు కొన్నారని, ప్రస్తుతం దీనికి సంబంధించిన కేసు లోకాయుక్తాలో నడుస్తోందని.. తన ప్రమేయం లేదని డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ వివరణ ఇచ్చారు.

హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరాలి

- అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూషకుమారి

కడప(రూరల్) జూలై 10: ద్విచక్రవాహనాలను నడిపే సమయంలో హెల్మెట్‌ను తప్పక ధరించాలని ఇన్‌చార్జ్ డీఎల్ఎస్ఏ సెక్రటరీ, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులు, న్యాయవాద క్లర్కులకు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మనల్ని మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ వాడి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలని, రోడ్డు భద్రత నియమావళిని పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడంపై తగు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద క్లర్కులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షల తనిఖీ



విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 10: వైవీయూ అనుబంధ కళాశాలల్లో జరుగుతున్న పీజీ సెమిస్టరు పరీక్షలను వైవీయూ రిజిస్ట్రారు ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్ట్స్ బ్లాక్‌లో జరుగుతున్న కేంద్రానికి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డితో కలిసి తనిఖీలు చేశారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడారు. అలాగే విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

మండల సమావేశంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హెచ్చరికలు

చెన్నూరు, జూలై 10: కనపర్తి వద్ద నిర్మాణంలో ఉన్న ఇళ్ల నాణ్యతపై పదే పదే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై విచారణ తప్పదని హౌసింగ్ ఏఈ మినిల్‌కుమార్‌ను హెచ్చరించారు. ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో పలు సమస్యలపై ఆయన అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. కట్టబోయే పక్కా ఇళ్లు అయినా పక్కాగా బాగుండేలా చూసుకోవాలన్నారు. మండలంలో రోడ్ల నిర్మాణంపై తనకు ఫిర్యాదులు అందాయని, అందులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి తీరుతామన్నారు. గ్రామీణాభివృద్ధి కోసం అవసరమైన నిధులను సర్పంచులకు నేరుగా అందేలా చూస్తామన్నారు. గ్రామాల్లో పలు ఇళ్లపై విద్యుత్ తీగలు వెళ్లాయని వాటిని పక్కకు మార్చేందుకు విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. మండలంలో ప్రధానంగా తాగునీరు, మురుగునీటి కాల్వ నిర్మాణం, రోడ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే పనుల్లో ఏ మాత్రం అవకతవకలున్నా, అవినీతి ఉన్నా ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా ఏ మాత్రం ఒప్పుకునేదిలేదని పదే పదే హెచ్చరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మండల సమావేశంలో ఉప్పరపల్లె ఎంపీపీ సురేశ్ యాదవ్, ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు వారిష్, రాచిన్నాయపల్లె సర్పంచ్ నారాయణరెడ్డి, శివాలపల్లె సర్పంచ్ సుదర్శనరెడ్డి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఉప్పరపల్లెలో కేసీ కెనాల్ రివిట్‌మెంట్ దెబ్బతినిందని, మొక్కలు నాటినా వాటిని సరిగా బతికించుకోలేక నిధులు వృధా చేశారన్నారు. కేసీ కెనాల్ కట్ట వెంబడి చెట్లు పెరిగి లైనింగ్ దెబ్బతిన్నా వాటిని తొలగించలేదన్నారు. రామనపల్లెలో తాగునీరు సరిగా లేదని, రాచిన్నాయపల్లెలో 30 ఏళ్ల కిందట వేసిన తాగునీటి పైపులైను పలుచోట్ల లీకేజీ అవుతోందని శివాలపల్లె పంచాయతీ గోపవరంలో నీరు సరిగాలేదని ప్రజాప్రతినిధులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఒకేచోట కాకుండా పీహెచ్‌సీని మరో చోటకు మార్చి అందరికీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరారు. రామనపల్లెలో చాలా ఏళ్లగా సబ్‌స్టేషన్‌కు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నట్లు శ్రీలక్ష్మి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి సహకరించాలని తహసీల్దారు ప్రకాశ్ బాబును ఎమ్మెల్యే ఆదేశించారు.

కైలాసగిరికోనలో కొత్తగా పాఠశాల భవనం నిర్మించాలని ఎంఈఓ గంగిరెడ్డి కోరారు. గతంలో స్కూలు కోసం 3 కి.మీ అడవి గుండా నడిచి వచ్చి గిరిజనులు ఇబ్బందులు పడేవారని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే ప్రతి సమస్య వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శనశర్మ, మండల ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారెడ్డి, ఇంజనీర్లు మురళీ, రామలింగారెడ్డి, ఏఓ శ్రీదేవి, పశు వైద్యాధికారి ఉపేంద్ర, సీహెచ్‌సీ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సతీశ్, డాక్టర్ చెన్నారెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఓ, ఏపీఎం, ఐసీడీఎస్ అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లాగానే పరిగణించాలి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న గోవర్ధనరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 10: జిల్లా పేరును కడప జిల్లాగానే పరిగణనలోకి తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హెలీకాప్టరు ప్రమాదంలో మరణిస్తే కడప జిల్లాకు వైఎస్ఆర్ కడప జిల్లాగా నామకరణం చేశారన్నారు. అప్పుడే టీడీపీ శ్రేణులు, ప్రజలు వ్యతిరేకించారని గుర్తు చేశారు. జిల్లాకు ఎంతో చరిత్ర ఉందని, కడప జిల్లా పేరు మార్చవద్దని ప్రజలంతా వ్యతిరేకించినా వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత కడప జిల్లా పేరును తీసివేసి వైఎస్ఆర్ జిల్లాగా నామకరణం చేశారని తెలిపారు. ఎందరో కవులకు పుట్టినిల్లు కడప జిల్లా అని, తెలుగు కోసం విశేష కృషి చేసిన సర్ థామస్ మన్రోకూడా జిల్లాకు ఎంతో సేవలందించారన్నారు. కేవలం జగన్ నాయన చనిపోయాడని పేరు పెట్టడం ఘోరమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో కూడా అన్ని పార్టీల నేతలు కడప జిల్లా పేరును మార్చడం వ్యతిరేకించారని చెప్పారు. వైఎస్ఆర్‌జిల్లా పేరును మార్చి కడప జిల్లాగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళితే ఆయన సానుకూలంగా స్పందిస్తూ జిల్లా పేరు మార్చేటప్పుడు కేంద్రాన్ని సంప్రదించాలని, అయితే కేంద్రం వైఎస్ఆర్ జిల్లాను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. జిల్లా ఇప్పటికీ కడప జిల్లాగానే కొనసాగుతోందన్నారన్నారు. అధికారం ఉందని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీగా పేరు మార్చడం దుర్మార్గమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గురప్ప, జయరాం, శంకర్‌రెడ్డి, అమీర్‌బాషా, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

దయ్యాలు వేదాలు వల్లించినట్లే

మేయర్ సురేష్ వ్యాఖ్యలపై టీడీపీ నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 10: వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయరు సురేష్‌బాబు వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ తెలిపారు. ఓటమితో వైసీపీ నేతల మైండ్ బ్లాక్ అయిందన్నారు. బుధవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరదాలు కట్టుకు తిరిగిన వైఎస్ జగన్‌కు సిగ్గు లేకుండా ప్రజాదర్బార్లు నిర్వహిస్తున్నారన్నారు. టీడీపీ గేట్లు తెరిస్తే వైసీపీ ఖాళీ ఖాయమన్నారు. టీడీపీ నేతలు వెంకటసుబ్బయ్య, మల్లేశ్, అమీర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే....

కడప (ఎడ్యుకేషన్), జూలై 10: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మేయరు సురేష్‌బాబు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానిబాషా ఎద్దేవా చేశారు. బుధవారం టీడీపీ కార్యాయలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 రోజుల్లోనే చెప్పిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే వైసీపీ నేతలకు నిద్ర పట్టడంలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమ ఇసుక, మట్టి, ఎర్రచందనాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులుపఠాన్‌ఖాజాపీర్, అక్రం, అస్లాం పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక'తో వైసీపీలో వణుకు'

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇసుక పథకాన్ని అమలు చేస్తుంటే వైసీపీ నేతలకు వణుకు పుడుతోందని మాజీ డిప్యూటీ మేయర్ అరిపుల్లా తెలిపారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా ఇసుక వేరే రాష్ట్రాలకు అమ్ముకుని కోట్ల రూపాయలు దండుకున్నారన్నారు. ఇప్పుడు పేదలకు చంద్ర బాబు ఉచితంగా ఇసుక ఇస్తుంటే వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.

అంకాళమ్మకు పూజలు



సికెదిన్నె, జూలై 10: చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంటలో వెలసిన అంకాళమ్మ ఆలయం మొదటివార్షికోత్సవం సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలను చల్లగా చూసి వర్షాలు కురిపించి రైతులు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

15 వరకు భాగవత సప్తాహం

వల్లూరు, జూలై 10: ఎ.ఓబాయపల్లె కనకదుర్గాదేవి దేవస్థానంలో ఆషాఢమాసం పురస్కరించుకుని 15 వరకు భాగవత సప్తాహం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. రోజూ తెల్లవారు జాము 5 నుంచి 6 వరకు గీతాపారాయణం అనంతరం సప్తాహం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వేంపల్లె, జూలై 10: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ, వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యం తీసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

'సీమ' ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత కేతు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 10: రాయలసీమ ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి అని డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణ తెలిపారు. బుధవారం సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రంలో ప్రొఫెసరు కేతు విశ్వనాథరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళుర్పించిన ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రజల జీవితానికి చిత్రిక పట్టిన రచయిత విశ్వనాథరెడ్డి అని తెలిపారు. కేతు విశ్వనాథరెడ్డి కథకుడు, విద్యావేత్త, పరిశోధకుడు, నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా

చెన్నూరు, జూలై 10: పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి విద్యావంతులుగా తయారు కావాలన్నదే తన ధ్యేయమని, ప్రతి విద్యార్థి చదివిన పాఠశాలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఆశించారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు మౌలిక వసతులు కావాలన్నా అందిస్తానన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఏటా వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతి విద్యార్థినీ ఉన్నత స్థానాల్లో నిలబెట్టేందుకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి పాఠశాలలో వసతులపై చెప్పారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, షబ్బీర్‌హుసేన్, మల్లికార్జునరెడ్డి, ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈఓ2 సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత చట్టాలపై అవగాహన కల్పించాలి

29న కడపలో ర్యాలీ, ధర్నా

కడప (మారుతీనగర్) జులై 10: సామాజికంగా వివక్షకు గురవుతున్న దళితులకు రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని రాష్ట్ర మాల మహానాడు (రామాజి వర్గం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక వినోద్‌కుమార్ కోరారు. రాష్ట్ర మాలమహానాడు జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నేటికీ అనేక గ్రామాల్లో వివిధ రూపాల్లో కొనసాగుతున్న కులవివక్ష రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకు నిరసనగా 29న సోమవారం ఉదయం 10గంటలకు కడప ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి తదుపరి ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. ర్యాలీ, ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి సూరిబాబు, సహాయ కార్యదర్శి ప్రణయ్‌కుమార్, విభజన కార్యదర్శి సీకే కుమార్, నాయకులు ఓబులేసు, ఎస్.పుల్లయ్య, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల రుసుం చెల్లించాలి

కడప (ఎడ్యుకేషన్), జూలై 10: ఎంటీఎస్ ఉపాధ్యాయులకు వేసవిలో నిర్వహించిన శిక్షణ తరగతులకు నిర్వహించిన రుసుం చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఏడీ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందించిన అయన మాట్లాడుతూ 2023 మేలో ఐదురోజుల పాటు ఎంటీఎస్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారని, వాటి రుసుం చెల్లించాలని ఏడీ సర్వీస్ ఉత్తర్వులు ఇచ్చినా జిల్లా నుంచి సరైన సమాచారం ఉన్నతాధికారులకు చేరకపోవడం వల్ల రుసుం చెల్లించక పోవడంలో జాప్యం జరుగుతోందన్నారు. వెంటనే తగిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు సుబ్బారెడ్డి, సుభాన్‌బాషా, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేశ్ రేపు జిల్లా పర్యటన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి

కడప (మారుతీనగర్) జులై 10: అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ 12న శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించి మొట్టమొదటిసారిగా కడప పర్యటనకు వస్తున్న సీఎం రమేశ్‌కు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున స్వాగతం పలికేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కడపలో పెద్దదర్గా, దేవుని కడపను సందర్శిస్తారన్నారు. అనంతరం మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరు చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం సీఎం రమేశ్ సొంత ఊరు పొట్లదుర్తిలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారన్నారు. కావున బీజేపీ నేతలు సహా ఎన్‌డీఏ కూటమి నేతలు భారీగా తరలి రావాలని కోరారు. సమావేశంలో భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీజేపీ నేతలు లక్ష్మణరావు పాల్గొన్నారు.

'విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి'

కడప (నాగరాజుపేట), జూలై 10: 23,500 మంది విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు బుధవారం నగరంలోని విద్యుత్ భవన్ వద్ద ఆందోళన చేసి పీఓ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందించారు. విద్యుత్ కార్మికులను ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు స్కిల్ చేసి స్కిల్డ్ వేతనం ఇవ్వాలన్నారు. కొత్త ఆపరేటర్లకు, పాత ఆపరేటర్లకు సమాన జీతాలు ఇవ్వాలని, ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియిమించాలన్నారు. రాష్ట్రంలో 25 ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత ఇసుక డంపింగ్‌యార్డ్ పరిశీలన



ఇసుక డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటపతి

కమలాపురం రూరల్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉచిత ఇసుక డ్రంప్ యార్డ్‌ను కడప ఆర్డీఓ వెంకటపతి పరిశీలించారు. బుధవారం కడప - తాడిపత్రి ప్రధాన రహదారి సమీప అమరావతి కల్యాణమండపం ఎదురుగా ఉన్న ఇసుక డంప్ యార్డును పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఇందులో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా పంపిణీ జరగాలన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇసుక అందేలా చూడాలన్నారు. ఇసుక పంపిణీలో అవినీతి చోటు చేసుకుంటే ముందుగా అధికారులపై చర్యలు తప్పవన్నారు. అనంతరం లబ్ధిదారులు అందిస్తున్న బిల్లులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈయన వెంట తహసీల్దారు సుబ్రమణ్యం, ఆర్ఐ అర్జున్‌రెడ్డి, ఏపీఎం అపర్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, జూలై 10: తప్పెట్ల గ్రామంలో సాగు చేస్తున్న వరి పంటను కమలాపురం వ్యవసాయ సహాయ సం చాలకులు నరసింహారెడ్డి సందర్శించారు. వాతావరణంలో ఎరువు పంటలో ఉల్లికోడ్ ఆశించడానికి అవకాశం ఉన్నందున రైతులంతా వరి నాటిన 20 రోజుల తరువాత సీప్రోనెల్ గుళికలు ఎకరాకు 8 కిలోల చొప్పున వేస్తే ఉల్లికోడ్, కాండం తొలిచు పురుగు నివారించు కోవచ్చన్నారు. వీటిని పొలంలో పలుచగా నీరు ఉంచి కలిపి చల్లుకోవాలన్నారు. నారుమడిలో 21 రోజుల తరువాత కార్లోతివాన్ గుళికలను సెంటుకు 160 గ్రాముల చొప్పున ఇసుకతో కలిపి వేస్తే చీడపీడ నివారణ అవుతుందన్నారు. ఆకుముడత పురుగు కానీ, కాండం తొలిచే పురుగు కానీ ఆశిస్తే పాఫైడ్రోక్లోరైడ్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి సాయిజ్యోతి మాట్లాడుతూ పొలంలో పంటనాటే సమయంలో 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున తూర్పు, పడమర దిశగా కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో పొలంలో గాలి వెలుతురు బాగా వచ్చి చీడపీడల ఉధృతి తక్కువగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రైతులు అడిగిన వివిధ ప్రశ్నలకు వాటికి సమాధానాలు, సలహాలను అందించారు.

మినుములో సస్యరక్షణ చేపట్టండి

వీరపునాయునిపల్లె, జూలై 10: మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు అన్నారు. బుధవారం అనిమెలలో మినుము పంటను ఆయన పరిశీలించారు. వర్షాలు పడినందున మినుములో పురుగుల, తెగుళ్ల సోకే అవకాశం ఉందన్నారు. లేత దశలో ఆకులు ఉన్నప్పుడు చిత్తపురుగులు ఆకులపై రంధ్రాలు చేస్తాయని, పేనుబంక మినుములో కాండంపై, పూతపై ఒక పొరలా ఏర్పడి రసం పీలుస్తుంటాయన్నారు. పటకు పల్లాకు తెగులు సోకినపుడు మొక్కల ఆకులు పసుపురంగులోకి మారతాయని, ఈ వైరస్ తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. వీటి నివారణకు వాడాల్సిన ఎరువులు, మందులను సూచించి వాడాల్సిన పద్ధతిని వివరించారు.

సందేహాలు నివృత్తి చేసుకోండి : ఏఓ

పెండ్లిమర్రి, జూలై 10: సజ్జ పంట సాగులో ఏమైనా సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు సూచించారు. బుధవారం శ్రీనివాసపురం గ్రామంలో సజ్జ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో 652 హెక్టార్లలో వరి, మినుము, సజ్జ, వేరుశనగ, కంది, చామంతి, ఉల్లి పంటలను సాగు చేశారన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికార గంగాధర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఘనస్వాగతం

పులివెందుల టౌన్, జూలై 10: సౌత్ జోన్ క్రీడలను ప్రారంభించేందుకు పులివెందులకు వచ్చిన రాష్ట్ర రవాణ, యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. కడప రోడ్డు పెట్రోల్‌బంకు వద్ద భారీ ఎత్తున బాణసంచా పేలుస్తూ బైక్ ర్యాలీచేశారు. అక్కడి నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చేరుకుని కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని నేతలు, కార్యకర్తలతో మమేకమయ్యారు. అనంతరం పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలిసి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటుచేసిన తేనేటి విందులో పాల్గొని పలు విషయాలపై చర్చించారు. మంత్రిని సత్కరించారు. టీడీపీ నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవ్, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మైసూరారెడ్డి, వెంకటేశ్, రహంతుల్లా, జనసేన నాయకులు ముని జగదీష్‌బాబు పాల్గొన్నారు.

నాగులగుట్టపల్లెలో...

చక్రాయపేట, జూలై 10: రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి బుధవారం సురభి నాగులగుట్టపల్లెలో టీడీపీ నేతలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఘనస్వాగతం పలికారు. టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి ఇంటి వరకు ఊరేగింపుగా వెళ్లారు. తొలుత బీటెక్ రవి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఉపసర్పంచు మెడికల్ స్టోర్ ఆంజనేయులు, టీడీపీ నేత టి.అమర్, జనసేన నేత నాగమల్లయ్య, నాగేంద్ర, బాలకృష్ణ, హరి కార్యకర్తలు స్వాగతం పలికారు.

నందిపల్లె వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలి




మంత్రిని సన్మానిస్తున్న టీడీపీ నేత షబ్బీర్ తదితరులు

వేంపల్లె, జూలై 10: నందిపల్లె వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పందిళ్లపల్లె రామగంగిరెడ్డి, కత్తలూరు మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డి కోరారు. పులివెందుల పర్యటనకు వెళ్తున్న ఆయనకు నందిపల్లె వద్ద టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలిసి వచ్చిన మంత్రికి మహిళలు మంగళహారతులు ఇచ్చారు. టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ సత్కరించారు. మైనార్టీ సీనియర్ నేత పూల అల్లాబక్షు, రామిరెడ్డిపల్లె మాజీ సర్పంచు శ్రీరామిరెడ్డి తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 10: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి మినిమం రూ.26వేలు జీతం పెంచి కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆలిండియా పిలుపులో భాగంగా కడప కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యకుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, మెడికల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నారాయణ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముల్ల ఫయాజ్



వేంపల్లె, జూలై 10: టీడీపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముల్ల ఫయాజ్ బాష నియామకమయ్యారు. వేంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథరెడ్డి బుధవారం వేంపల్లెలో ఫయాజ్ బాషకు నియామకపత్రం అందించారు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాష, వేంపల్లె మండల కన్వీనర్ రామునిరెడ్డి, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి షరీఫ్, డాక్టర్ కరీముల్లా, సయ్యద్ పీరా, మస్తాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ, సీఐడీ విచారణ జరిపించాలి

ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టరు సుభాన్‌బాషా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 10: హాకీ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, సెక్రటరీ హర్షవర్ధన్, మాజీ సెక్రటరీ నిరంజన్‌రెడ్డిపై సీబీఐ, సీఐడీ ద్వారా విచారణ చేపట్టాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన గుర్తింపు రద్దు చేయాలని ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టరు సుభాన్‌బాషా, జిల్లా హాకీ సెక్రటరీ రాజు డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందించారు. 2014 నుంచి తప్పుడు రెజల్యూషన్, తప్పుడు సమాచారం ఇచ్చి హాకీ ఇండియా ద్వారా గుర్తింపు పొంది రాష్ట్రంలో 2019 నుంచి ఇప్పటి వరకు క్రీడాకారుల భవిష్యత్తు వారి కళాశాలల అడ్మిషన్లు ఉద్యోగాల్లో సర్టిఫికెట్ గుర్తింపు లేకుండా చేశారని ఆరోపించారు.

17న డీవైఎఫ్‌ఐ జిల్లా వర్క్‌షాపు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 10: డీవైఎఫ్ఐ జిల్లా వర్క్‌షాపు 17న బద్వేలులో జరుగుతుందని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈ వర్క్‌షాపు జరుగుతుందన్నారు. జిల్లాలోని డీవైఎఫ్ఐ యువజన సంఘం జయప్రదం చేయాలని కోరారు.

తూకాలు తక్కువగా ఉంటే వెనక్కి పంపండి : ఎమ్మెల్సీ

పులివెందుల టౌన్, జూలై 10: రేషన్ సరఫరాలో తూకాలు తక్కువ ఉంటే వెనక్కి పంపాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రేషన్ గోడౌన్‌ను పరిశీలించి అక్కడున్న బియ్యం బస్తాలను తూకాలు వేయగా ప్రతి బస్తాలో కిలో మొదలు ఒకటిన్నర కిలో వరకు తక్కువగా వచ్చాయి. రేషన్ సరఫరా చేసేసంస్థలు తక్కువ తూకాలతో పంపుతున్నారని, ఐదేళ్లగా పౌర సరఫరా శాఖలో భారీగా మోసాలు జరిగాయన్నారు. పులివెందులలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువతకు ఉపాధి కల్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. రాయలసీమ ప్రాంతం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వీలుగా అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైసూరారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఏపీ ఎన్జీఓ నేతలు

కడప(కలెక్టరేట్) జూలై 10: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి. రవికుమార్ సంఘ నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను సంఘనేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఉద్యోగుల సమస్యలపై నేరుగా కలవాలని, సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంఘ నేతలు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, శైలేశ్వరరెడ్డి, చిన్నయ్య, గౌరీ, జ్యోతి, సుహాసిని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కడప చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి

కడప (క్రైం), జూలై 10: ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కడప చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి సూచించారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ర్యాలీ అప్సర సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన లేకపోవడం కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఎస్ఐలు రవికుమార్, మహ్మద్ రఫీ, సిబ్బంది, లీగల్ సెల్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు.



గ్రంథాలయం తనిఖీ

చాపాడు, జూలై 10: చాపాడులోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల వద్ద నుంచి రూ.50 , పెద్దల వద్ద నుంచి రూ.100 సభ్యత్వం నమోదు ఎక్కువ చేయాలని లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డికి సూచనలు ఇచ్చారు. నక్కలదిన్నె గ్రామంలోని ఉప గ్రంథాలయం వివరాలు బీడీవో రవి శంకర్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు విజయవంతం

గోపవరం, జూలై 10 : మండల లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో మండలం బుచ్చనపల్లె గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎన్నుకున్న సందర్భంగా ఆ గ్రామంలో మండల లీగల్ సర్వీసు కమిటీ కోర్టుభవనాలు బద్వేలు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, బ్రహ్మానందరెడ్డి ఎస్.రమణారెడ్డి న్యాయవాది మాట్లాడారు. ఈ కార్యక్రమలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన సదస్సు

బి.కోడూరు, జూలై 10 : కీటక జనిత వ్యాధులపై వైద్యాధికారులు వినీత్ కుమార్‌రాజు, ఉదయకిరణ్ బుధవారం ప్రభుత్వ వైద్యశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా మంచినీరు కాచి చల్లార్చి వడబోసి తాగాలన్నారు. దోమల ద్వారా వచ్చే వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే మలేరియా మాసోత్సవాలు నిర్వహించి వైద్యసిబ్బంది, ఆశాలు ప్ర జలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, సీహెచ్‌వో నాగమణి, హెల్త్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, జాన్‌విలియం, సునీత, వెంకటేశ్వర్లు, చంద్రశేఖ ర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో వర్షం



తేరు రోడ్డులో నిలిచిన వర్షపునీరు

జమ్మలమడుగు, జూలై 10: జమ్మలమడుగు పట్టణంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు ఓ మోస్తారు వర్షం కురిసింది. సుమారు 30 నిమిషాలపాటు వర్షం కురిసింది. దీంతో పట్టణంలని ప్రధాన రోడ్లలో వర్షపునీరు నిలిచింది. నారాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సమీపాన తేరు రోడ్డులో వర్షపునీరు నిలిచింది. అలాగే మరికొన్ని చోట్ల వర్షపునీరు ఆగింది.

విద్యార్థులకు పలకలు పంపిణీ

ఎర్రగుంట్ల, జూలై 10: ఎర్రగుంట్ల మహేశ్వరనగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే వీధికి చెందిన సింగం నాగమల్లారెడ్డి ఉచితంగా పలకలను గురువారం పంపిణీచేశారు విద్యార్థులకు కేకులు, బిస్కెట్లు పండ్లను కూడా ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లు అవినీతిపై దర్యాప్తు జరిపించాలి



లోకేశ్‌తో ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు , జూలై 10 : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అవినీతిపై విజిలెన్సు అధికారులతో దర్యాప్తు జరిపించాలని ప్రొద్దుటూరు టీడీపీ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి కోరారు. బుధవారం విజయవాడలో మంత్రి నారాలోకేష్‌ను ప్రవీణ్‌రెడ్డి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడం కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పించాలని కోరారు.

మైనర్లకు బైకులు ఇవ్వొద్దు

ట్రాఫిక్ సీఐ యుగంధర్



ప్రొద్దుటూరు క్రైం, జూలై 10 : మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని ట్రాఫిక్ సీఐ యుగంధర్ అన్నారు. బుధవారం ట్రాఫిక్ సీఐ తన సిబ్బందితో వాహనదారులకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక పోలీసులతో వాహన తనిఖీ చేసి జరిమానా విధించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా బైక్ లివ్వొద్దని తెలిపారు. ముఖ్యంగా తల్లిద ం డ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

పార్టీలు వద్దు.. కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

● పశువుల సంత పాత చోటికే ● అవినీతిని సహించను ● మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, జూలై 10 : మున్సిపల్ కార్యాలయం ప్రజా సమస్యలను తీర్చే దేవాలయం లాంటిది, ఇక్కడ పార్టీలు వద్దు, అందరం కలసి కట్టుగా ఉండి మున్సిపాలిటీని అభివృద్ధిచేద్దామని, అయితే అవినీతిని సహించబోనని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ భవన్‌లో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్ యాదవ్‌కు తొలి సమావేశం కావడంతో ఆయన ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఛైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ తదితర అత్యవసర సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని, పార్టీలకు అతీతంగా అన్ని సమస్యలు పరిష్కరించాలని కోరారు. అజెండా 30 అంశాలతో కూడిన వివిధ అభివృద్ధి పనులపై సభ్యులు ఆమోదించారు. కాగా మైదుకూరు పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న పశువుల సంతను అభద్రతా భావం దృష్ట్యా గతంలో నిర్వహిస్తున్న పట్టణంలోని మార్కెట్‌కమిటీ ఆవరణలోనే నిర్వహించాలని అజెండాలో చేర్చగా, వైసీపీ సభ్యులు ప్రస్తుతం నిర్వహించే చోటే ఉండాలని, కమిటీ ఆవరణలో రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలంటూ అభ్యంతరం తెలపగా, పశువుల సంతను పాతచోటికి మార్చడంతో పాటు రైతు బజార్ కూడా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. అలాగే బస్టాండ్ వద్ద ఆర్టీసీ వారు నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు కూడా కాలువను ఆక్రమించి ఏర్పాటు చేశారని, కాలువలు కుదించుకపోయి వర్షపు నీరంతా రోడ్లపై నిలబడిపోతాయని టీడీపీ సభ్యులు పేర్కొనడంతో దానిపై విచారించాలని రెవెన్యూ అధికారులను కోరారు.

ఎమ్మెల్యే పుట్టాకు ఘన స్వాగతం..: తొలిసారిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది. తొలిత టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు బాణ సంచా పేల్చి స్వాగతం తెలపగా, మున్సిపల్ ఛైర్మెన్ మాచనూరు చంద్ర, కమిషనరు జబ్బార్‌మియా పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం సమావేశ మందిరంలో ఆయన ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బ్రహ్మంగారిమఠం, జూలై 10 : బ్రహ్మంగారిమఠం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరవుతున్నారన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

డెంగీ పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి

ఎర్రగుంట్ల, జూలై 10: ప్రాణాలను హరించే డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి కే.లక్ష్మయ్య పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్ల పీహెచ్‌సీ నుంచి సోషల్ వర్కర్, టీడీపీ టౌన్ అధ్యక్షుడు ఎస్.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా పూర్తి జాగ్రత్తలుతీసుకోవాలన్నారు.ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను వెంటనే తరలించాలి

కొండాపురం, జూలై 10: ముంపునకు గురైన కొండాపురం పాత ఊరిలో ఉన్న ప్రభుత్వ కళాశాల, పశువుల ఆసుపత్రిలను వెంటనే మార్చాలని సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు కోరారు.బుధవారం వారు ఎంపీడీవో నాగప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలు అరికట్టకుంటే చర్యలు

సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు కమిషనర్ చార్జ్ మెమోలు

ప్రొద్దుటూరు ,జూలై 10 : ప్రొద్దుటూరు పట్టణంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను నిరోధించటం, సకాలంలో వాటిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంపై సచివాయ ప్లానింగ్ సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి చార్జ్ మెమోలు జారీ చేశారు. 13 వవార్డు శ్రీరాములపేటలోని ఎం.హేమలత, కేవీ చలపతి నిర్మిస్తున్న కట్టడం టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. కానీ ఆ కట్టడంపై సంబంధిత ఇన్‌చార్జ్ టీపీబీవో కేశవ కళ్యాణ్, 13 వవార్డు సెక్రటరీ పి, భవాని చర్యలు తీసుకోకపోవడం పై వారిని మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు కమిషనర్ జారీ చేశారు. వీరితో పాటు 36వవార్డు సాంబయ్యగారి వీధిలో సూర్యప్రకాష్‌రెడ్డి ప్లానుకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై నోటీసులు ఇచ్చినా స్పందించని కారణంగా ఆకట్టడంపై సకాలంలో చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఇన్‌చార్జ్ టీపీబీవో అనిల్‌కుమార్‌రెడ్డి, వార్డు ప్లానింగ్‌సెక్రటరీ కేశవ రంగయ్యకు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేసి మూడు రోజుల్లో వివరణ ఇవ్వకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటానని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.పట్టణంలోని పలువార్డుల్లో అక్రమ కట్టడాలను నిరోధించటంలో వార్డుల్లో వున్న ప్లానింగ్ సెక్రటరీలు ఎవ్వరు అవినీతికి పాల్పడి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బొల్లవరం మున్సిపల్ ప్లాట్లలో జంగిల్ క్లియరెన్స్ పనులు

త్వరలో మున్సిపల్ ప్లాట్లకు వేలం : కమిషనర్ రఘునాథరెడ్డి



జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 10 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన బొల్లవరంలోని ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లలో మున్సిపల్ సిబ్బంది రెండు రోజులుగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. బుధరవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి యంత్రాలతో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్‌పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లవరంలో 83.38 ఎకరాలలో అప్రూవల్ మున్సిపల్‌లేఅవుట్ వుందన్నారు. అందులో 8.45 ఎకరాలు ఓపెన్ ప్లేస్‌కు 24.74 ఎకరాలు రోడ్లు వేసి విశాలమైన ఆహ్లాదకరమైన ప్లాట్లు ఏర్పాటు చేశారన్నారు. ఎంఐజీ 147 ప్లాట్లు కాగా హెచ్‌ఐజీ 95 ప్లాట్లు వున్నాయన్నారు. మొత్తం 760 ప్లాట్లలో ఇంకా 500 ప్లాట్లు విక్రయాలనికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 40, 60, 80 అడుగుల విశాలమైన రోడ్లు, డ్రైనేజీ, పార్కు, కమ్యూనిటీ భవనాలు ఇతర అన్ని సదుపాయాలతో అందంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మున్సిపల్ లేఅవుట్‌లో ఇప్పటికే మెటల్ రోడ్లు వేసివున్నారని వాటి పై సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి పైపులైను , విద్యుత్ సరఫరా పనులు వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.త్వరలో ఈ ప్లాట్లను వేలం వేయడానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

క్రిస్టియన్ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, జూలై 10 : మున్సిపాలిటీ 4 వవార్డులోని క్రిస్టియన్ శ్మశాన వాటిక కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని 4 వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ కాకుమాని ఆనంద్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సానుకూలంగా స్పందించి తహసీల్దారుకు సిఫారసు చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పాస్టర్ మురళి, చంద్రశేఖర్, కిరణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక డంపింగ్‌యార్డ్ పరిశీలన

కమలాపురం రూరల్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఉచిత ఇసుక డ్రంప్ యార్డ్‌ను కడప ఆర్డీఓ వెంకటపతి పరిశీలించారు. బుధవారం కడప - తాడిపత్రి ప్రధాన రహదారి సమీ ప అమరావతి కల్యాణమండపం ఎదురుగా ఉన్న ఇసుక డంప్ యా ర్డును పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఇందులో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా పంపిణీ జరగాలన్నా రు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇసుక అందేలా చూడాలన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నవరూప్ కుమార్

జమ్మలమడుగు, జూలై 10: జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు సమీప ప్రాంతాల నుంచి 300 మంది నిరుద్యోగులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో అమర్‌రాజా కంపెనీ వారు 111 మందిని ఇంటర్వ్యూ చేసి సెలెక్టు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ వారు 50 మందిని, డిక్సన్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ వారు 60 మందిని, న్యూ హాలెండ్ ట్రాక్టర్ కంపెనీవారు 19 మందిని సెలెక్టు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

'ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం పథకం అమలు చేయాలి'

ప్రొద్దుటూరు టౌన్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లులకు ఇచ్చే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయడం వలన ఆ పాఠశాలలు బలోపేతం అవుతాయని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించిన జీవో నెం.117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సుబ్బయ్య, సయ్యద్‌బాషదస్తగిరి,ఈశ్వర్‌రెడ్డి,అబ్దుల్‌ఖాదర్,సుధాకర్, జహంగీర్ పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

అక్రమిత భూములను స్వాధీనం చేసుకోండి

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ జూలై 10 : మైదుకూరు మండలంలో ఆక్రమిత భూములను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అధికారులను ఆదేశించారు.స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభ భవనంలో బుధవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరైయ్యారు.మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు హాజరైయ్యారు.సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ఆక్రమిత భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా శ్మశానాలకు సరైన దారులు లేకుండా కొన్ని ఉన్నాయని, మరి కొన్ని శ్మశానాలను ఆక్రమించారని వాటిని కూడా గుర్తించాలని అధికారులకు తెలిపారు. కాగా బోగస్ పింఛన్లను వెంటనే వెరిఫికేషన్ చేయాలని కోరారు. ఉపాధిహామీ పథకంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని కూడా తనిఖీలు చేసి అక్రమాలు జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రెహమాన్,డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

చాపాడు, జూలై 10: మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు మొగిలి రామమోహన్, రామాంజనేయులు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేను గ్రామంలో ఊరేగింపు జరిపారు. బాణసంచా పేల్చి డప్పులతో ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. సుధాకర్‌యాదవ్ గ్రామ దేవత అంకాళమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, నాయకులు వేమారెడ్డి, గురివిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయబ్‌రసూల్, వెంకటసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, అక్బర్ సలీం, గోసుల కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుదర్శన్, గోర్ల సుబ్బరాయుడు, ఓబులేసు, శ్రీనివాసులు, రవీంద్ర, మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లను వేధించడం సరికాదు



వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

ముద్దనూరు జూలై10:రాజకీయ నాయకులు అంగన్వాడీ టీచర్లను వేధించడం సరికాదని అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీవో ముంతాజ్‌బేగానికి బుధవారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కోర్కెలు దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది వినతిపత్రం అందించారు. అందులో భాగంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ కొండాపురం మండలంలో ప్రస్తుతం అంగన్వాడీల్లో టీచర్లుగా పనిచేస్తున్న వారిని రాజకీయనాయకులు వేధింపులకు గురిచేసి తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎంత వరకు ఇది సమంజసమన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది కళావతి, వరలక్ష్మి,హైమావతి, ప్రమీల, కుష్మ తదితరులు పాల్గొన్నారు.

మట్కా క్రికెట్ బుకీలకు కౌన్సెలింగ్

ప్రొద్దుటూరు, జూలై 10 : ప్రొద్దుటూరులో మట్కా, క్రికెట్ బుకింగ్ లాంటి అసాంఘీక నేరాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో మట్కా, క్రికెట్ బుకీలకు డీఎస్పీ ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు పరిధిలో ఎక్కడ మట్కా కేంద్రాలు, జూద గృహాలు నడిపినా, క్రికెట్ బెట్టింగ్‌లు ఆడినా ఎవ్వరినీ ఉపేక్షించేది లేదన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

జమ్మలమడుగు, జూలై 10: కార్మిక వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని సీఐటీయూ ఆలిండియా పిలుపు మేరకు డిమాండ్ చేస్తున్నట్లు సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి విజయ్, యేసుదాసు తెలిపారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ సంస్థలను అమ్మడమే ప్రధానమైన లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఐసీడీఎస్‌లను బలోపేతం చేయాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో శ్రీనివాస్‌కు అందజేశారు. నాయకులు ఆదాము, దివాకర్, దస్తగిరి, రమేష్, శేఖర్, శివ, విజయ్, నరసింహ, సుబ్బయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేసి స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ పిలుపు మేరకు పోరుమామిళ్ల లోని తహసీల్దారు కార్యాలయం వద్ద సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టీలుప్లాంటు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలోసీడీపీవోకార్యాలయంలో వినతిపత్రం అందించారు.

ప్రొద్దుటూరు టౌన్..: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయ్‌కుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, బాలసుబ్బయ్య, ప్రమీలమ్మ, చంటి, రమాదేవి, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, పోరుమామిళ్లలో సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం